# ఇల్లలకగానే పండగౌనా?

ఇల్లాలు కాకపూర్వం ఓ యువతి, చదువూ సంధ్య, తెలివీ, చాకచక్యం, సమయస్ఫూర్తి, హాస్యం, లాస్యం అన్నీ కలిగిన అమ్మాయి.

అమ్మాయి అందం, తెలివీ, వాళ్ళ నాన్న ఇచ్చిన కట్నం బాగా నచ్చిన ఓ చిన్నవాడు ఆ అమ్మాయి మెడలో మూడుముళ్ళూ వేసి, ఓ ఇంటికి ఇల్లాల్ని చేసి, 'ఇదిగో అమ్మడూ ఈ ఇల్లు నీది' అని చెప్పాడు. ఆ ఇల్లాలు వెంటనే పైట నడుముకి బిగించి, ఇంటిని అందంగా అలికి ముగ్గులు పెట్టింది. ఆ చిన్నవాడు వెంటనే ఆ ఇల్లాల్ని మెచ్చుకుని "నువ్వు ఇల్లు అలకడంలో నేర్పరివి – ముగ్గులు వెయ్యడంలో అంతకన్నా నేర్పరివి – సెభాష్! కీప్ ఇట్ అప్" అని ఇంగ్లీషులో మెచ్చుకుని భుజం తట్టాడు.

http://esldrill.com

దాంతో ఆ ఇల్లాలు తెగ మురిసిపోయి, ఇల్లలకడమే ధ్యేయంగా తన జీవితాన్ని కొనసాగించింది. ఎల్లప్పుడూ ఇంటిని పరిశుభ్రంగా అలికి రంగురంగుల రంగవల్లికలు తీర్చిదిద్దింది. ఆ విధంగా ఆమె జీవితం మూడు అలుకుగుడ్డలూ – ఆరు ముగ్గుబుట్టలుగా సాగిపోతూ వచ్చింది. కానీ ఒకనాడా ఇల్లాలు ఇల్లలుకుతూ అలుకుతూ "నా పేరేమిటి చెప్మా!" అనుకుంది. అలా అనుకుని ఉలిక్కిపడింది. చేతిలో అలుకు గుడ్డా, ముగ్గు బుట్టా అక్కడ పడేసి కిటికీ దగ్గర నిలబడి తల గోక్కుంటూ, "నా పేరేమిటి... నా పేరేమిటి!" అని తెగ ఆలోచించింది. ఎదురుగా నేమ్‌బోర్డ్ వ్రేలాడుతోంది. మిసెస్ ఎం.సుహాసిని, ఎం.ఎ ., పి.హెచ్‌డి. – ప్రిన్స్‌పాల్ 'ఎక్స్' కాలేజి అని. అవును అలాగే తనకీ ఓ పేరుండాలి కదా – ఇలా మర్చిపోయానేమిటి? ఇల్లలికే సంబరంలో పేరు మరిచిపోయాను. ఇప్పుడెలాగ అనుకుని ఆ ఇల్లాలు కంగారు పడిపోయింది. మనసంతా చికాగ్గా అయిపోయింది. ఎలాగో ఆ పూటకి ఇల్లలకడం కానిచ్చింది. అంతలో పనిమనిషి వచ్చింది. పోనీ ఆమెకైనా గుర్తుందేమోనని, "అమ్మాయ్! నా పేరు నీకు తెలుసా?" అని అడిగింది.

"అదేమిటమ్మా! అమ్మగార్ల పేర్లతో మాకేమిటి పని! మీరంటే మాకు అమ్మగారే! ఫలానా తెల్ల మేడ క్రింద భాగంలో అమ్మగారంటే మీరు" అన్నది ఆ అమ్మాయి.

"అవున్లే పాపం నీకేం తెలుసు" అనుకుంది ఇల్లాలు.

స్కూల్ నుంచి పిల్లలు మధ్యాహ్న భోజనానికి వచ్చారు. పిల్లలకైనా గుర్తుందేమో నా పేరు అనుకుంది ఇల్లాలు.

"ఒరే పిల్లలూ, నా పేరు మీకు తెలుసా?" అని అడిగింది. వాళ్ళు తెగ ఆశ్చర్యపడిపోయి "నువ్వు అమ్మవి... నీ పేరు అమ్మే... మేం పుట్టినప్పటినుంచీ మాకు తెలిసింది అదే. నాన్నగారి పేరుతో ఉత్తరాలొస్తాయి. ఆయన్నంతా పేరుతో పిలుస్తారు గనుక మాకు తెలుసు. నీ పేరు నువ్వు మాకెప్పుడూ చెప్పలేదు కదా... పోనీ నీ పేరుతో ఉత్తరాలు కూడా రావు" అనేశారు వాళ్ళు. అవును తనకెవరు ఉత్తరాలు రాస్తారు? అమ్మా నాన్న ఉన్నారు గానీ నెలకో, రెండు నెలలకో ఓ సారి ఫోన్ చేస్తారు. చెల్లెళ్ళు, అక్కలూ కూడా వాళ్ళ వాళ్ళ ఇళ్ళు అలుక్కోవడంలో నిమగ్నమై ఉన్నారు. వాళ్ళు ఏ పెళ్ళిలోనో పేరంటంలోనో కలిస్తే కొత్త ముగ్గుల్ని గురించో... వంటల్ని గురించో మాట్లాడడమేగాని ఉత్తరాలు లేవు. ఇల్లాలు నిరాశపడింది. ఆమెకు అశాంతి ఎక్కువైంది. తన పేరెలాగైనా గుర్తు తెచ్చుకోవాలనే తపన ఎక్కువైంది. అంతలో

పక్కింటావిడ పేరంటం పిలవడానికొచ్చింది. పోనీ ఆవిడకేమైనా గుర్తుందేమోనని అడిగితే ఆవిడ కిసుక్కున నవ్వేసి, "మరే! మీ పేరు నేనడగాలేదు... మీరు చెప్పాలేదు. కుడిచేతివైపు తెల్లమేడావిడ అల్లదుగో ఆ మందుల కంపెనీ మేనేజర్ గారి భార్య అనో లేకపోతే తెల్లగా, పొడుగ్గా ఉంటుందే ఆవిడ అనో చెప్పుకుంటాం... అంతే" అనేసింది ఆ ఇల్లాలు.

ఇంక లాభంలేదు... పిల్లల, స్నేహితులు మాత్రం ఏం చెప్తారు. వాళ్ళకి కమలా వాళ్ళ అమ్మ అనో, ఆంటీ అనో తెలుసు. ఇక భర్తగారొక్కరే శరణ్యం... ఆయనకే గుర్తుంటే వుండాలి.

For class 10 English quizzes (For students of A.P and Telangana) - esldrill.com

రాత్రి భోజనాల దగ్గర అడిగింది "ఏవండీ నా పేరు మర్చిపోయానండి. మీకు గుర్తుంటే చెప్పరా!"

భర్తగారు పెద్దగా నవ్వేసి "అదేమిటోయ్ ఎన్నడూ లేనిది ఇవ్వాళ పేరు సంగతి ప్రస్తావిస్తున్నావు. నిన్ను పెళ్ళయిన్నాటి నుంచి "ఏమోయ్" అని పిలవడం అలవాటైపోయింది. నువ్వు కూడా అలా పిలవకండి, నా పేరు నాకుంది కదా అని చెప్పలేదు. అందుకని నేనూ మర్చిపోయాను. ఇప్పుడేం? నిన్నందరూ మిసెస్ మూర్తి అంటారుగదా" అన్నాడు.

"మిసెస్ మూర్తి కాదండీ నా అసలు పేరు నాక్కావాలి. ఎలాగిప్పుడు?" అన్నది ఆవేదనగా.

"దానికేం పోనీ ఏదో ఒక పేరు పెట్టేసుకో కొత్తది" అని సలహా ఇచ్చాడు ఆయన.

"బావుందండీ... మీ పేరు సత్యనారాయణ మూర్తి అయితే మిమ్మల్ని శివరావు అనో సుందరరావు అనో పెట్టుకోమంటే ఊరుకుంటారా? నా పేరే నాక్కావాలి" అంది.

"చదువుకున్నావు గదా... సర్టిఫికెట్లమీద పేరుంటుంది గదా. ఆ మాత్రం కామన్ సెన్స్ లేకపోతే ఎలా. చూసుకో" అని సలహా ఇచ్చాడాయన మళ్ళీ.

ఇల్లాలు సర్టిఫికెట్ల కోసం హోరాహోరీ ఇల్లంతా వెతికింది. బీరువాలో పట్టు చీరెలు, షిఫాన్ చీరెలు, నేత చీరెలు, వాయిల్ చీరెలు, వాటి మ్యాచింగ్ జాకెట్లు, లంగాలు, గాజులు, పూసలు, ముత్యాలు, పిన్నులు, కుంకుమ భరిణెలు, గంధం గిన్నెలు, వెండి కంచాలు, బంగారం నగలు అన్నీ పొందికగా అమర్చి వున్నాయేగానీ అందులో ఎక్కడా సర్టిఫికెట్ల జాడ లేదు. అవును... తను పెళ్ళయిన తరువాత ఇక్కడికొచ్చేటప్పుడు అవి తెచ్చుకోలేదు.

"అవునండీ! నేను వాటిని ఇక్కడికి తెచ్చుకోలేదు. నేను మా ఊరు వెళ్ళి ఆ సర్టిఫికెట్లు వెతుక్కుని నా పేరు అడిగి తెలుసుకుని రెండు రోజుల్లో వచ్చేస్తాను" అని అడిగింది భర్తని.

"బాగానే వుంది. పేరు కోసం ఊరెళ్ళాలా? ఏం? నువ్వు ఊరెడితే ఆ రెండు రోజులూ ఇల్లెవరలుకుతారు?" అన్నాడు నాథుడు. అవును నిజమే మరి. తనందరికన్నా బాగా అలుకుతుందని గదా.. ఆ పని ఎవర్నీ చెయ్యనివ్వలేదు ఇన్నాళ్ళూ. ఎవరి పనులు వాళ్ళకున్నాయి. ఆయనకి ఉద్యోగం, పిల్లలకి చదువులు, వాళ్ళకెందుకులే శ్రమ పాపం అనుకుని తనే ఆ పని చేస్తూ వచ్చింది. వాళ్ళకు అసలు చేతకాదు మరి.

For class 10 English quizzes (For students of A.P and Telangana) - esldrill.com

అయినా పేరు తెలీకుండా ఎలా బ్రతకడం.

ఇన్నాళ్ళూ ఆ విషయం గుర్తు రాలేదు కనుక సరిపోయిందిగానీ గుర్తొచ్చాక కష్టంగానే ఉంది.

"రెండు రోజులెలాగైనా కష్టపడండి. నే వెళ్ళి నా పేరు కనుక్కుని రాకపోతే బ్రతకలేకుండా ఉన్నాను" అని బ్రతిమలాడి బయటపడిందా ఇల్లాలు.

For class 10 English quizzes (For students of A.P. and Telangana) - esldrill.com

"ఏమ్మా ఇంతర్జంటుగా వచ్చావు? ఆయనా పిల్లలూ బావున్నారా? ఒక్కదానివే వచ్చావేం?" అని అమ్మానాన్న ఆప్యాయంగానే పలుకరించినా అందులో కొంత సందేహాన్ని కూడా జోడించారు. వచ్చిన పని వెంటనే గుర్తుకొచ్చి...

"అమ్మా నా పేరేమిటో చెప్పమ్మా" అని అడిగింది ఎంతో దీనంగా ఇల్లాలు.

"అదేమిటమ్మా! నువ్వు మా పెద్దమ్మాయివి. నీకు బి.ఎ.దాకా చదువు చెప్పించి యాభైవేలు కట్నం ఇచ్చి పెళ్ళిచేశాం. రెండు పురుళ్ళు పోశాం. ప్రతి పురిటికీ ఆస్పత్రి ఖర్చులు మేమే భరించాం. నీకిద్దరు పిల్లలు. మీ ఆయనకి మంచి ఉద్యోగం. చాలా మంచివాడు కూడానూ. నీ పిల్లలు బుద్ధిమంతులు.'

"నా చరిత్ర కాదమ్మా, నా పేరు కావాలమ్మా నాకు. పోనీ నా సర్టిఫికెట్లు ఎక్కడున్నాయో చెప్పు."

"ఏమోనమ్మా! ఈ మధ్య అలమారల్లో పాత కాగితాలు,

ఫైళ్ళు అన్నీ ఖాళీ చేసేసి గాజు సామాన్లు సర్దించాం. కొన్ని కొన్ని ముఖ్యమైన ఫైళ్ళు అటకమీద పడేశాం. రేపు వెతికిద్దాంలే. ఇప్పుడు వాటికేం తొందర. హాయిగా స్నానం చేసి భోజనం కానియ్యమ్మా" అన్నది ఆ ఇల్లాలి తల్లి. ఇల్లాలు హాయిగా స్నానం చేసి భోజనం చేసింది కానీ నిద్ర రాలేదు. ఆడుతూ పాడుతూ ఇల్లలుకుతూ ముగ్గులేస్తూ పేరు మర్చిపోవడం వల్ల ఇలా ఇన్ని కష్టాలొస్తాయని ఎప్పుడూ అనుకోలేదు.

తెల్లవారింది గానీ అటకమీద ఫైళ్ళలో సర్టిఫికెట్లు వెతకడం పూర్తికాలేదు. ఈలోగా ఆ ఇల్లాలు కనబడిన మనిషినల్లా అడిగింది. చెట్టునడిగీ... పుట్టనడిగీ...చెరువునడిగీ... తను చదివిన స్కూలునడిగీ... కాలేజీనడిగీ... అరచీ ఆక్రోశించి ఎట్టకేలకు ఓ మిత్రురాలిని కలిసి తన పేరును సంపాదించింది. ఆ స్నేహితురాలు తనలాగే, తనతోనే చదువుకుని తనలాగే పెళ్ళి చేసుకుని, తనలాగా ఇల్లలకడంగా కాకుండా, ఇల్లలకడం బ్రతుకులో ఓ భాగంగా బ్రతుకుతూ తన పేరునూ, తన స్నేహితురాళ్ళ పేర్లనూ కూడా గుర్తుంచుకున్న వ్యక్తి. ఆ స్నేహితురాలు ఈవిడ్ని చూడగానే గుర్తుపట్టి "ఓ, హాయ్ శారదా! నా ప్రియమైన శారదా!" అని కేకలు పెట్టి కౌగలించేసుకుంది. అప్పుడా ఇల్లాలిని దాహంతో ఆర్చుకుపోయి, ఎండిపోయి ప్రాణం పోవడానికి సిద్ధపడిన వాడికి కొత్త కూజాలో నీళ్ళు చెంచాతో నోట్లో పోసి బ్రతికించిన చందంగా... బ్రతికించింది ఆ స్నేహితురాలు.

”నువ్వు శారదవి. మన స్కూల్లో టెన్త్ క్లాసులో ఫస్ట్ వచ్చావు. కాలేజీలో జరిగిన మ్యూజిక్ పోటీల్లో ఫస్టొచ్చావు. అప్పుడప్పుడు మంచి మంచి బొమ్మలు వేసేదానివి. మనందరం పదిమంది స్నేహితులం. వాళ్ళందర్నీ నేను అప్పుడప్పుడూ కలుసుకుంటూనే ఉన్నాను. మేం ఉత్తరాలు రాసుకుంటూనే ఉన్నాం. నువ్వొక్కదానివే మాకు అందకుండా పోయావు. చెప్పు ఎందుకు అజ్ఞాతవాసం చేస్తున్నావు?” అని నిలదీసింది ఆవిడ.

”అవును ప్రమీలా... నువ్వు చెప్పింది నిజం. నేను శారదనే... నువ్వు చెప్పేదాకా నాకు జ్ఞాపకం రాలేదు. నా మెదడులోని అరలన్నీ కూడా ఇల్లు ఎంత బాగా అలకాలీ అనే విషయంమీదే కేంద్రీకృతం అయిపోయాయి. ఇంకేం గుర్తులేదు. నువ్వు కనపడకపోతే నాకు పిచ్చెక్కిపోయేది” అంది శారద అనే పేరుగల ఆ ఇల్లాలు. శారద సరాసరి ఇంటికి వచ్చి అటక ఎక్కి పాత ఫైళ్ళు తిరగతోడి తన సర్టిఫికెట్లు, తను వేసిన బొమ్మలు, పాత ఆల్బంలు అన్నీ సాధించింది. తను స్కూల్లో, కాలేజీలో గెలుచుకున్న ప్రైజులు కూడా వెతికి పట్టుకుంది.

కొండంత సంతోషంతో ఇంటికి తిరిగి వచ్చింది. ”నువ్వు లేవు. ఇల్లు చూడెలా ఉందో... సత్రంలా వుంది. అమ్మయ్య నువ్వొచ్చావు. ఇంక మాకు పండగేనోయ్” అన్నాడు శారద భర్త. ”ఇల్లలకగానే పండగ కాదండీ... అవును గానీ ఇకనుంచీ నన్ను ఏమోయ్ గీమోయ్ అనకండి. నా పేరు శారద. శారదా అని పిలవండి తెలిసిందా” అని కూనిరాగాలు తీస్తూ హుషారుగా లోపలికి వెళ్ళింది. ఏ మూల దుమ్ము ఉందో, ఎక్కడ సామాన్లు ఆర్డర్‌లో లేవోనని చాలా సీరియస్‌గా వెతుకుతూ, డిసిప్లిన్ కోసం తపనపడే శారద రెండు రోజులుగా దులపని సోఫాలో హాయిగా చేరబడి, తను తెచ్చిన బొమ్మలని పిల్లలకి చూపిస్తోంది.